క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగులకు నేత్ర వైద్యశిబిరం



కందనూలు: జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన నేత్ర శిబిరం విజయవంతమైందని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన నేత్ర శిబిరంలో 48 మంది విశ్రాంత ఉద్యోగస్తుల కుటుంబసభ్యులకు కంటి పరీక్షలతో పాటు 11 మందికి క్యాటరాక్ట్ పొర ఉన్న వారిని గుర్తించి హైదరాబాద్‌కు ఆపరేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడివిజన్ సిబ్బంది స్వరూప్‌రెడ్డి, జగదీష్, కోశాధికారి వెంకటశెట్టి, యుగందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని శ్రీపురంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంచార వైద్య శిబిరాన్ని నిర్వహించి 86 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డి.కుమార్, గంధం ప్రసాద్, రాజవర్ధన్‌రెడ్డి, కేశవులు, అరుణ పాల్గొన్నారు.

రేపు 'మట్టి వాసన' పుస్తకావిష్కరణ

కందనూలు: జిల్లా కేంద్రంలోని నేషనల్ హైస్కూల్‌లో నెల పొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉదయం 10గంటలకు ప్రముఖ కవి యడవల్లి నాగరాజు రచించిన 'మట్టి వాసన' కవిత్వ పుస్తకావిష్కరణ ఉంటుందని వనపట్ల సుబ్బయ్య, పి.వహీద్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పెబ్బేటి మల్లికార్జున్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి కవులు సాహిత్య అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతా రామచంద్రాస్వామి దేవాలయంలో ఆవరణలో పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ శంకుస్థాపన చేస్తారని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పట్టణ అధ్యక్షుడిగా భానుప్రకాష్‌రెడ్డి



కొల్లాపూర్: పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సంగెం భానుప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నియామకపు పత్రాన్ని హైదరాబాద్‌లో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషిచేస్తానన్నారు. మంత్రికి, స్థానిక కాంగ్రెస్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



వెల్దండ: మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో శుక్రవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ఎర్రశ్రీనుముదిరాజ్ భూమి చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కాలనీలో రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మల్లేష్‌ముదిరాజ్, నాయకులు కృష్ణముదిరాజ్, నాగేశ్వర్‌గౌడ్, రమేష్, శేఖర్, యాదయ్య, శ్రీశైలం, కృష్ణయ్య, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

బెల్ట్ షాపులు తొలగించాలి

తెలకపల్లి: గ్రామాల్లో బెల్ట్ షాపులు తొలగించాలని వైస్ ఎంపీపీ కె విజయనిర్మల డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ప్రభుత్వం అరికట్టాలని కోరారు. మద్యానికి యువత బానిసలుగా మారి అనారోగ్యంతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలామంది కుటుంబాల్లో తగాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ఈ నెల 13న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. యువత చిన్నవయసులో మృతిచెందడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. అధికారులు స్పందించి గ్రామాలలో ఉన్న బెల్ట్ షాపులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరీక్షణకు తెరపడేనా?

● అభివృద్ధికి నోచుకోని ఏజెన్సీ ప్రాంతాలు



ప్రశాంతినగర్ గ్రామం వ్యూ

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని ప్రశాంతినగర్, వంగురోనిపల్లి, కుమ్మరోనిపల్లి గ్రామాలు సర్పంచ్ పదవులకు నోచుకోవడం లేదు. ఈ ప్రాంతాలు ఏజెన్సీగా గుర్తించడంతో సర్పంచ్ పదవులకు ఎస్టీ రిజర్వేషన్ ప్రకటించింది. ఇదే ఆగ్రామాలకు శాపంగా మారింది. ఆయా గ్రామాల్లో ఎస్టీలు లేకపోవడంతో సర్పంచ్ పదవికి పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. అమ్రాబాద్ మండలంలో తుర్కపల్లి గ్రామం మినహాయిస్తే గ్రామ పంచాయతీలన్నీ కూడా అప్పట్లో ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించారు. దీంతో ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో కొంత కాలంగా సర్పంచుల పదవులు గిరిజనులకు రిజర్వు చేయబడ్డాయి. గతంలో మన్ననూర్ గ్రామంలో ప్రశాంత్‌నగర్ విలీనంగా ఉండేది. అదే విధంగా కుమ్మరోనిపల్లి గ్రామం వంగురోనిపల్లి గ్రామ పంచాయతీలో ఆమ్లేట్ విలేజ్‌గా ఉండేది.

గ్రామపంచాయతీలుగా గుర్తించినా..

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలనకు సౌలభ్యం కోసం 500 మంది జనాభా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించారు. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గ్రామాలు సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. వంగురోని పల్లి గ్రామంలో కొన్ని ఏళ్లుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తించిన చంద్రమ్మ గిరిజన ఓటరుగా నమోదుచేసుకుంది. పదవీ విరమణ అనంతరం ఆ రెండు గ్రామాలకు సుమారు మూడు దఫాలుగా 15ఏళ్లు కుమ్మరోనిపల్లి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది. ఈమె ప్రస్తుతం వయోభారంతో ప్రస్తుతం ఓటర్ లిస్ట్‌లో పేరుకూడా రెన్యూవల్ చేసుకోకపోవడంతో గ్రామంలో ఎస్టీలు లేక సర్పంచ్ పదవికే పోటీ చేసే అవకాశం లేదు.

ప్రశాంత్‌నగర్‌లో వంద శాతం దళితులే..

అదేవిధంగా మన్ననూర్ గ్రామం నుంచి ప్రశాంతి కాలనీని వేరు చేసిన గత ప్రభుత్వం ప్రశాంతి నగర్ పేరుతో ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. 100 శాతం దళితులు నివాసం ఉంటున్న గ్రామం అయినప్పటికి ఏజెన్సీ పరిధిలోనే ఉండటం, గ్రామంలో గిరిజనులు లేకపోవడంతో పంచాయతీ చేసినా నిరుపయోగంగా మారింది. దీంతో సర్పంచ్ పదవికి నోచుకోవడం లేదు. ఈ గ్రామంలో 8 మంది వార్డు సభ్యులకు గానూ నలుగురు వార్డు సభ్యులు ఎస్టీకి రిజర్వ్‌డ్ కాగా, నాలుగు స్థానాల్లో జనరల్‌కు కేటాయించారు. దీంతో జనరల్ స్థానంలో దళితులు పోటీ చేసి వార్డుసభ్యులుగా ఎన్నికయ్యారు. మిగతా నాలుగు స్థానంలో గ్రామంలో ఎస్టీలు లేకపోవడంతో ఆ స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

కనీస సౌకర్యాలు కరువు

ప్రశాంత్ నగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్‌లు లేకపోవడంతో గ్రామ అభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీకి పక్కా భవనం లేక కమ్యూనిటీ భవనం నుంచే పరిపాలన కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. నిధులు కేటాయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. బీటీ రోడ్డు ప్రస్తుతం గుంతులమయంగా దర్శనమిస్తోంది. గ్రామానికి కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటూ ఏజెన్సీని సవరించి గ్రామానికి సర్పంచ్ పదవి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇతరులకు అవకాశం ఇవ్వాలి



ప్రశాంత్‌నగర్‌లో 100 శాతం దళితులే నివాసం ఉంటున్నారు. ఈ గ్రామాన్ని ఏజెన్సీ పరిగణలోకి తీసుకోకుండా సర్పంచ్ పదవిని ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలి. ఎస్టీలు లేని గ్రామాల్లో ఇతరులకు అవకాశం కల్పించాలి. ప్రభుత్వం వెంటనే ఆదిశగా చర్యలు తీసుకోవాలి.

–వైపీ నిరంజన్, ప్రశాంత్‌నగర్

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



దేవల్‌తిరుమలాపూర్ స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్ వేంకటేశ్వర శ్రీదేవీ, భూదేవీ కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు భవనాచార్యులు, శేషాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సత్యం, యజ్ఞయ్య, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని వేంకకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 24వ తేదీన స్వామివారి రథోత్సవం నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం అన్నదాన చేశారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కోడేరు: మండల కేంద్రంలో నేటి నుంచి మూడు రోజుల పాటు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు రాఘవేంద్ర శర్మ తెలిపారు. 24న సుప్రభాతం, గణపతిపూజ, పుణ్యాహచనం, అఖండ దీపారాధన, నవగ్రహ పూజ, అవహీత ఆరాధన, మహామంగళహారతి, మంత్రపుష్పం, 25న సుప్రభాతసేవ, వేంకటేశ్వర స్వామి మహాభిషేకం, అలంకారం, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, మహామంగళహారతి సేవలు ఉంటాయని వివరించారు. 26న సత్యనారాయణస్వామి వ్రతం, మహామంగళహారతి, స్వామివారి ఊరేగింపు తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



మాచారం గ్రామ ప్రధాన వీధుల్లో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారం సీతారామాంజనేయ స్వాముల ఆలయం ప్రథమ వార్షికోత్సవ మహోత్సవం వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పల్లకీ ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో అడుగుల భజన పోటీలు, , నియోజకవర్గ స్థాయిలో కోలాటం పోటీలు ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని రామగిరి సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆలయం చుట్టూ బండ్లు, ట్రాక్టర్లు, వాహనాలతో ప్రదక్షిణలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో తరలివచ్చారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



చారకొండ మండలం జూపల్లిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



లింగాలలో..

సాక్షి, నెట్‌వర్క్: పెద్దకొత్తపల్లి చంద్రకల్ ఉన్నత పాఠశాల, చారకొండ మండలం జూపల్లి జెడ్పీహెచ్ఎస్, లింగాల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, తెలకపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకోం

కొల్లాపూర్ రూరల్: మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకోమని మండల బీఆర్ఎస్ ఎంపీటీసీలు, మాజీ ఇన్‌చార్జ్ ఎంపీపీ బోజ్యానాయక్‌ను హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొందరు కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా మాజీ ఎమ్మెల్యేను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఐదు సంవత్సరాలలో గిరిజనులకు మాజీ ఎమ్మెల్యే పెద్దపీట వేశారన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు శంకర్ నాయక్, పండు నాయక్, కోండ్ర బిచ్చయ్య, నాగేంద్రమ్మ తదితరులు ఉన్నారు.

టాలెంట్ టెస్టులో విద్యార్థి ప్రతిభ



తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టులో మండలంలోని అంతారం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన సిద్ధార్థ జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించాడు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం శేషగిరి, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థి సిద్ధార్థను అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి పంపనున్నట్లు హెచ్‌ఎం శేషగిరి తెలిపారు.

డ్రైయినేజీ నిర్మాణం చేపట్టాలి



తాడూరు: మండల కేంద్రంలో ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు అనుసరించుకుని ఉన్న మురుగు కాలువ అసంపూర్తిగా వదిలేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని గ్రామస్తులు తెలిపారు. ప్రధాన రోడ్డుకు పక్కనే ఉండటంతో ప్రయాణికులు దుర్వాసన భరించలేకపోతున్నారని వాపోయారు. అధికారులు పరిశీలించి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

మొక్కలను కాపాడుకుందాం



వెల్దండ: మండలంలోని ఎంపీతండా, అల్లంతోట బావితండాల్లో శుక్రవారం వాటరింగ్ డే నిర్వహించారు. ఈసందర్భంగా హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్ ట్యాంకర్ల ద్వారా నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో మొక్కలు, చెట్లు ఎండకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఏ రాజ్‌కుమార్, ఆయా గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



కోడేరు: మండల కేంద్రంతో పాటు నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి, తుర్కదిన్నె, రాజాపూర్, సింగాయిపల్లి, రేకులపల్లి, మాచుపల్లి, నార్యనాయక్‌తండా, మైలారం, నర్సాయిపల్లి, బాడిగదిన్నె, ఎత్తం, కొండ్రావుపల్లి తదితర గ్రామాల్లో తహసీల్దార్ విజయ్‌కుమార్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సిబ్బంది జమ్ములయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా హనుమంతు ముదిరాజ్

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్‌డబ్ల్యుయూ రాష్ట్ర కార్యదర్శిగా హనుమంతు ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసి శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శ్రీనయ్య, గోలి రవీందర్, బుల్లెట్ పాండూ కౌలాష్, వెంకటేష్, శ్రీనివాస్, రీజనల్ డిపో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ ద్వారా సహాయ సహకారాలు నిరంతరం అందిస్తామని క్లాస్‌మెట్ క్లబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. వంగూరు మండలం తుమ్మలపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా బాధ్యుడు శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్, కోశాధికారి రాజేందర్, ప్రధానోపాధ్యాయుడు జహంగీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్య నందితకు ఘన నివాళి



కుడికిల్లలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చారకొండలో

సాక్షి, నెట్‌వర్క్: కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతిచెందింది. ఈ మేరకు కొల్లాపూర్ మండలంలోని కుడికిల్ల గ్రామ బీఆర్ఎస్ నాయకులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. వెల్దండ మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, సింగల్‌విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ కడారి కృష్ణయ్య, నాయకులు శ్రీనివాస్‌నాయక్, నాగయ్యగౌడ్, జంగయ్య, రవికుమార్, బాల్‌రాజ్, శ్రీను, కృష్ణారెడ్డిలు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చారకొండలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు లక్ష్మణ్, మాజీ సర్పంచ్ ప్రశాంత్ నాయక్, యువకులు చండీశ్వర్, రామకృష్ణలు నివాళులర్పించారు.

27న భారత్ వికసిత్ సంకల్ప యాత్ర

లింగాల: మండలంలో ఈ నెల 27న నిర్వహించే భారత్ వికసిత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సలేశ్వరం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అంబట్‌పల్లి నుంచి మండల కేంద్రమైన లింగాల వరకు సంకల్ప యాత్ర కొనసాగుతుందని తెలిపారు. జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని వివరించారు.

కొనసాగుతున్న ఈ కేవైసీ



తాడూరు: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ కేవైసీ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నెల వరకు రేషన్‌కార్డుదారులకు గడువు ఉన్నందున మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఈ కేవైసీ కేంద్రం వద్ద బారులు తీరారు. ఆధార్‌తో ఫోన్ అనుసంధానం, ఓటర్ ఐడీ కార్డులో మార్పులు, చేర్పులు, జిల్లా పేరు మార్పులు చేయించుకుంటున్నారు. గడువును పొడిగించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు.

రైతులు నిరసన



కల్వకుర్తిరూరల్: ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనకారులపై హర్యానా ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం దాడులు చేయడం అప్రజాస్వామ్యం అని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కిషోర్ అన్నారు. శుక్రవారం మండలం యంగంపల్లి, మార్చాల గ్రామాల్లో పలువురు రైతులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, మహేష్, పాండు రంగారెడ్డి, వెంకటేష్, రంగయ్య, శ్రీకాంత్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: రైతులపై కాల్పులను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ శుక్రవారం ఖండించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాకీ తూటాలకు బలైన రైతు కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేడు పౌర్ణమి పూజలు

పెంట్లవెల్లి: మండలంలోని గోపాలపురంలో పౌర్ణమి పురస్కరించుకొని శనివారం రామలింగేశ్వర స్వామి ఆలయంలో సహస్ర లింగార్చన మహాపూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పార్వతీ పరమేశ్వరుల కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అనురాధ

మన్ననూర్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ అన్నారు. శుక్రవారం అమ్రాబాద్ మండలం తుర్కపల్లిలో రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. నాణ్యతగా సీసీ నిర్మాణాలు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అదేవిధంగా వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి గ్రామాల్లో కొన్ని రోజుల కిందట మృతి చెందిన రెండు కుటుంబాలకు పరామర్శించి కొంత ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మ, మాజీ సర్పంచ్ కాశమ్మ, అంబనారాయణ, నవీన్, వెంకటయ్య, రాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు



వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ మంజుల

వెల్దండ: వరి పంటలకు సోకుతున్న తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ మంజుల రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కోనేటివాడ, గాన్‌గట్టుతండా, వెల్దండ తదితర గ్రామాల్లో ఆమె వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంట ప్రస్తుతం 40 నుంచి 45 రోజుల దశలో ఉందన్నారు. వాటిలో కాండం తొలుచుపురుగు, ఆకు ఎండు తెగుళ్ల ఉధృతి అధికంగా ఉందన్నారు. ఆకు ఎండు తెగుళ్ల నివారణకు కాపారాక్సిక్లోరైడ్ 600 గ్రాములు, అగ్రోమైసిన్, ప్లాంటోమైసిన్ 60 గ్రాములు కలిపి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అదే విధంగా కాండం తొలుచుపురుగు నివారణకు క్లోరాంత్రనిలిప్రోల్ గుళికలు ఎకరానికి నాలుగు కిలోలు పంటపొలంలో చల్లాలన్నారు. పంటలకు ఎలాంటి తెగుళ్లు సోకిన రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలన్నారు. ఏఈఓలు రైతులు దాక్యనాయక్, లోక్యనాయక్, గోపాల్, రాము తదితరులు ఉన్నారు.

ఆటో–బైక్ ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

వెల్దండ: మండల కేంద్ర సమీపంలో హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఆటో, బైక్‌లు ఢీకొన్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవి వివరాల ప్రకారం బైక్‌పై కల్వకుర్తి మండలం కుర్మిద్ద గ్రామానికి చెందిన బాలకృష్ణ కల్వకుర్తి నుంచి ఆటోలో పాలు తీసుకొని వెల్దండ మండలం సోషల్ వెల్ఫేర్ బాలికల, ఏకలవ్య పాఠశాలకు బయలుదేరాడు. తమిళనాడుకు చెందిన గోపినాథ్ బైక్‌పై హైదరాబాదు నుంచి కల్వకుర్తి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో మండల సమీపంలో దర్గా వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న గోపినాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ బాలకృష్ణకు కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం ఎన్నమ్స్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ రవి తెలిపారు.

ఆధార్ కార్డు కేంద్రం ఏర్పాటు



కొల్లాపూర్ రూరల్: పట్టణ సమీపంలో ఉన్న ఫారెస్టు డిపో దగ్గర కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాలకు చెందిన చెంచు ఆదివాసిలకు ఆధార్ కార్డులు లేని వారికి ప్రత్యేక కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. శుక్రవారం మండలానికి చెందిన అమరగిరి, భ్రమరంభ కాలనీ, చెంచుగూడెం, నల్లమల చెంచుపెంటల్లో నివాసం ఉంటున్న చెంచులు ఆధార్ నమోదు చేసుకున్నారు. మూడు రోజులు ఆధార్ కేంద్రం నిర్వహిస్తునట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసి చెంచులు పాల్గొన్నారు.